క్లుప్తంగా

షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా

బేతంచెర్ల : పట్టణ సమీపంలోని కర్నూలు రహదారిలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆషాడమాసం గురువారం సందర్భంగా భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప గ్రామాలు, పట్టణవాసులు ఉదయం బాబాకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, కాకడ హారతి చేపట్టారు. అనంతరం ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు కృపాధామ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంజామల: జూలై 31న జరిగిన రోప్ స్కిప్పింగ్ జిల్లా స్థాయిలో పోటీల్లో సంజామల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జి.చిన్మయ్, స్మృతి, రుఫియా, రూబా, వరుణ్ తేజ్, నవీన ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు కర్నూలు జిల్లా గార్గేయపురంలో ఈ నెల 10,11వ తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు భాషాను హెచ్ ఎం శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీ

కొలిమిగుండ్ల: రవాణాశాఖ అధికారులు గురువారం తెల్లవారు జామున రెండు గంటల నుంచే కొలిమిగుండ్లలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, జమ్మలమడుగు క్రాస్ రోడ్డులో తనిఖీలు చేసి ఓవర్‌లోడ్, సరైన పత్రాలు లేని లారీ,ట్రాక్టర్‌పై కేసులు నమోదు చేశారు. ప్రతి రోజు తెల్లవారు జాము నుంచే ట్రాక్టర్లలో నాపరాళ్ల రవాణా సాగిస్తుంటారు. అధికారులు తనిఖీలు చేస్తున్నారనే విషయం తెలియగానే ట్రాక్టర్ యజమానులు ఎక్కడిక్కడ తమ వాహనాలను అధికారుల కంట పడకుండా పక్కన పెట్టుకున్నారు. అధికారుల వాహనం పోయే వరకు చాలా మంది యజమానులు పోలీస్ స్టేషన్ చుట్టు పక్కల మకాం వేశారు. తనిఖీ అధికారులుపూర్తిగా వెళ్లిపోయారని నిర్ధారించుకున్నాక ట్రాక్టర్లను రోడ్డుపైకి ఎక్కించారు.

ఫర్టిలైజర్స్ దుకాణం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ సుధాకర్ రెడ్డి

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్లలో అవని ఫర్టిలైజర్స్ షాప్‌లో గురువారం ఏఓ సుధాకర్ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులతోపాటు స్టాక్‌ను పరిశీలిచారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ షాప్ యజమానులు అనుమతుల్లేని పురుగు మందులను విక్రయించి రైతులకు నష్టం చేకూర్చొద్దని సూచించారు. రైతులకు పురుగు మందుల వివరాలపై అవగాన కలిగిఉండాలని, సందేహాలపై వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్స్ మానస, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్ విడుదల అయ్యిందని ఎంఈఓ అబ్దుల్ కలాం తెలిపారు. మండలంలో 47 ప్రాథమిక, 10 ఉన్నత, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలతో కలిపి మొత్తం 59 ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఉదయం నోటిఫికేషన్‌ను బోర్డులపై అతికించారన్నారు. మధ్యాహ్నం ఓటర్ల జాబితా ప్రదర్శించారని పేర్కొన్నారు. 8న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సభ్యుల ఎన్నికలకు నిర్వహణ జరుగుతుందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌తో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యుత్‌శాఖ డీఈగా నాగేంద్ర



డోన్ టౌన్ : విద్యుత్ శాఖ సబ్ డివిజన్ డిప్యూ టీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా టి. నాగేంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ డీఈగా పని చేస్తున్న రమణారావు కొద్ది రోజుల క్రితం పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో అనంతపురంలో విధులు నిర్వహిస్తున్న నాగేంద్రను డోన్‌కు బదిలీ చేస్తూ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌లోని ఏఈలు నాగేశ్వర రెడ్డి,మద్దిలేటి,రాఘవేంద్రప్రసాద్‌తోపాటు కార్యాలయ సిబ్బంది ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రైవేటు వాహనాల జోరు



డోన్ పాతబస్టాండ్‌లో జీపులో సరుకులు, ప్రయాణికులను తరలిస్తున్న దృశ్యం



ఆర్‌టీసీ బస్సు వచ్చినా కదలని ప్రైవేటు వాహనం

- బస్సులు ఉన్నా కదలని వాహనాలు
- పట్టించుకోని డిపో అధికారులు
- ఆర్‌టీసీ ఆదాయానికి గండి

డోన్: స్థానిక పాతబస్టాండ్‌లో ఆర్‌టీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు వాహనాల జోరు పెరిగిపోయింది. డోన్ నుంచి కర్నూలు వైపు ఆర్‌టీసీ డిపో నుంచి ప్రయాణికుల రద్దీకి సరిపడ బస్సులు నడపకపోవడంతో ప్రైవేటు ఆటోలు, జీపులు వందలాది మందిని తరలిస్తున్నాయి. దీంతో నిత్యం ఆర్‌టీసీ ఆదాయానికి పెద్దమొత్తంలో గండిపడుతోంది. ప్రైవేటు వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు వాహనాల్లో ప్రయాణికులను తరలించకుండా చూడటంలో డిపో అధికారుల నిర్లక్ష్యత ప్రైవేటు వాహనదారులకు వరంగా మారింది. ఒకవేళ ఆర్‌టీసీ బస్సు స్టాండ్‌లో ఉన్నా వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్నారు. అధికారులు స్పందించి ఆర్‌టీసీ ఆదాయాన్ని పెంపొందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



హాస్టల్ స్టోర్ రూంను పరిశీలిస్తున్న అధికారులు

బేతంచెర్ల : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని గోరుమానుకొండ సమీపంలోనున్న మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆవరణలో మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ మరియదాసు, సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక చేయూత



విద్యార్థినిని వాసవి పాఠశాలలో చేర్పిస్తున్న సురేష్

డోన్: ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఐదవ తరగతి తర్వాత చదువు మానేసిన డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన బోయ స్వప్న (12) అనే పేద విద్యార్థినికి దాతలు చేయూతనంది ంచారు. విషయం తెలుసుకున్న డోన్ మండలం మ ల్యాల నివాసి ప్రస్తుతం హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న సురేష్ వాసవి పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి పదవతరగతి వరకు ఆ విద్యార్థినికి అయ్యే ఖర్చు మొత్తాన్ని తానే భరిస్తానని ఒప్పించారు. అనంతరం విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ జలదుర్గం రమేష్, కుళ్లాయిరెడ్డిలకు అప్పగించారు. డాక్టర్ నాగరాజు నాయక్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ

డోన్ టౌన్ : ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం చేపట్టారు. పట్టణంలోని మాకంవీధి,తారకరామనగర్, కొండపేట తదితర కాలనీల్లో జరుగుతున్న పంపిణీని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పర్యవేక్షించారు. మొదటి రోజు మున్సిపాలిటీ పరిధిలో 98.39 శాతం పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు. జిల్లాలో డోన్ మున్సిపాలిటీ మూడవ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ గురువారం 97.55 శాతం పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. మండలంలో వివిధ రకాల మొత్తం పింఛన్ల 12,555 మంది లబ్ధిదారులు ఉండగా 12,248 మందికి నగదు అందజేశామన్నారు. అయితే ఏ అధికారి పింఛన్ ఇస్తారో తెలియక లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు.

వాల్మీకి నాయకుడి అరెస్టు సరికాదు

ప్యాపిలి: ముచ్చుమర్రి ఘటనలో హత్యాచారానికి గురైన బాలిక ఆచూకీ కనిపెట్టలేని పోలీసులు ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్నను అరెస్టు చేయడం సరికాదని ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బంగి నాగరాజు అన్నారు. గురువారం ప్యాపిలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ నాయకుడు సీఎం పర్యటనను అడ్డుకుంటానని ప్రకటించనప్పటికీ పోలీసులు అదుపులోకి తీసుకోవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇలా నిర్బంధించిన దాఖలాలు లేవన్నారు. వెంకటేశ్వర్లు, హనుమప్ప, రామాంజనేయులు, రామాంజనేయులు, రామాంజి, చంద్ర పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొలిమిగుండ్ల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. సీనియర్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం కొలిమిగుండ్లలోని దండోరా కార్యాలయం నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో కలిసి బాణసంచా కాల్చుతు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ ఆవరణలో స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గూటం మారెన్న,కంబగిరిరాముడు,చిన్న ఫక్కీర,చిన్న పెద్దన్న, వంశీ, రామచంద్రుడు,పెద్ద దస్తగిరి,బాల ఓబులేసు, నాగన్న, రాయప్ప,సురేష్, అంజి,రామాంజనేయులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై గురువారం సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇవ్వడంపై మాదిగ సంఘాలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వర్గీకరణ సమర్థనీయమైందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీయడం అభినందనీయమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఓబులేసు, సుధాకర్, వెంకటసుబ్బయ్య తదితరుల ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అవుకు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రం అవుకు ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సాత్రి బాలరాజు, మద్దిలేటి, నిచ్చెనమెట్ల మద్దిలేటి, బలరాముడు, టీబీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతినిస్తూ గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎమ్మార్పీస్ నాయకులు,ఎస్సీలు హర్షం వ్యక్తం చేశారు. గురువారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన వెంటనే సంబరాలు చేసుకున్నారు. ఎమ్మార్పీస్ జాతీయ అధికార ప్రతినిధి గుండాల ఈశ్వర్యయ్య మాదిగ ఆధ్వర్యంలో పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాణా సంచా కాల్చి పాలాభిషేకం చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటిస్వామి హర్షం వ్యక్తం చేశారు.

బేతంచెర్ల: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం హర్షణీయమని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అనిల్ అన్నారు. గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రాముడు, శివ, నడ్డి శ్రీను, ఎల్లయ్య, జెల్లా శ్రీను, మధుసూదన్ పాల్గొన్నారు.

అక్రమాలను బహిర్గతం చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచెర్ల: స్థానిక కేజీబీవీలో చోటు చేసుకుంటున్న అక్రమాలను జిల్లా అధికారులు బహిర్గతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ కోరారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ మధుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, పాఠశాలలో జరిగే అవినీతి అక్రమాలపై కమిటీ వేసి నిజాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. సంఘం మండల కార్యదర్శి ప్రదీప్, నాయకులు అనిల్, సురేంద్ర, మహబూబ్, మధు తేజ, మనోజ్, రాజేష్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ కీలకదశ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కోవెలకుంట్ల: విద్యార్థి భవిష్యత్తు నిర్ణయించుకునేందుకు ఇంటర్మీడియెట్ కీలకదశ అని ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, కోవెలకుంట్ల మాజీ జెడ్పీటీసీ బీవీ ప్రసాదరెడ్డి, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిలేటిస్వామి, రామలింగారెడ్డి, రామాంజులు, వెంకటశివుడు, సుబ్బరాయుడు, ప్రేమ్‌చంద్, స్వప్న, శివమ్మ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి



పిల్లలే భోజనం వడ్డిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : విద్యార్థులతో పని చేయిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, ఆర్ఎస్ఎఫ్ నాయకులు శివన్న,భాస్కర్,చిరంజీవి,సురేష్ డిమాండ్ చేశారు. పట్టణ సమీపంలోని అంబేడ్కర్ ఎస్సీ బాలుర పాఠశాలలో విద్యార్థుల చేత పనులు చేయిస్తున్న విషయాన్ని తల్లిదండ్రుల ద్వారా సమాచారం తెలుసుకున్న వీరు గురువారం సాయిత్రం పాఠశాలకు వెళ్లి సందర్శించగా అక్కడ విద్యార్థులు భోజనాలు వడ్డిస్తుండటాన్ని గమనించారు. గతంలో ఇక్కడ భోజనం వడ్డిస్తుండగా వంటమనిషిపై సాంబారు పడి గాయాలపాలైందని గుర్తు చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన బోయశేఖర్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం విక్రయిస్తుండగా కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.గురువారం నిందితుడిపై దాడి చేయగా 40 టెట్రా ప్యాకెట్లు అమ్ముతుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



దోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వాహనాల తనిఖీ..భారీగా జరిమానా



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంవీఐ క్రాంతికుమార్



పోలీసుస్టేషన్ రోడ్డులో ఆటోడ్రైవర్‌ను హెచ్చరిస్తున్న ఎంవీఐ

సాక్షి ఎఫెక్ట్

డోన్: పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తున్న వాహనాలను గుర్తించి ఎంవీఐ భారీగా జరిమానా విధించారు. సాక్షి దినపత్రికలో గురువారం 'డేంజర్ జర్నీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వాహనాల తనిఖీ చేపట్టారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు స్కూల్ బస్సు, ఆటోలు, టాటా మేజిక్‌లను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇందులో ఏడు ఆటోలతో పాటు విజ్ఞాన్ హైస్కూల్‌కు చెందిన స్కూల్ వ్యాన్ పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తుండటంతో రూ.1.58 లక్షల జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రవ పత్రాలను డ్రైవర్లు తమ వెంట ఉంచుకోవాలని, ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని సూచించారు. పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడటం తగదని ఆయన ప్రైవేటు వాహనాల యజమానులను హెచ్చరించారు.


ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



మ్యాన్‌హోల్ పడిన చోట ట్రాఫిక్ నియంత్రణ గేటును ఉంచిన అధికారులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలి డబుల్ రోడ్డు పై అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ కూలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం సిమెంట్ కంపెనీలకు చెందిన భారీ వాహనాలు, టిప్పర్లు అధిక లోడ్‌తో వివిధ ప్రాంతాలకు వెళ్తుంటాయి. అధిక లోడ్ కారణంగా వారం క్రితం అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ కూలిపోయింది, సుమారు 4 అడుగుల మేర గుంత ఏర్పడింది. తాత్కాలికంగా ట్రాఫిక్ నియంత్రణ గేటును గుంతపడిన ప్రదేశంలో అడ్డంగా ఉంచారు. ఈ గేటు అడ్డంగా ఉంచడం వలన వాహనలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది.

కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తి వద్ద కుందూనదికి పోటెత్తిన వరద



కుందూనదికి పోటెత్తిన వరద



కోవెలకుంట్ల మండలం వల్లంపాడు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

కర్ణాటక, మహారాష్ట్ర, తదితర ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు భారీగా చేరింది. రిజర్వాయర్ నుంచి అధికారులు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కుందూనదికి నీటిని విడుదల చేశారు. వరద నీటితో కోవెలకుంట్ల మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న కుందూనదికి వరదనీరు పోటెత్తింది. కుందూకు మరింత వరద పెరిగే అస్కారం ఉండటంతో నదీతీర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని 30 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరు పుష్కలంగా చేరింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరితోపాటు ఆరుతడి పంటలు సాగు చేసేందుకు సాగునీరు అందుబాటులో ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– కోవెలకుంట్ల

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాలకు చెందిన విద్యార్థులు రూతు, సమీర రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య తెలిపారు. గురువారం పాఠశాలలో ఇరువురు విద్యార్థులను పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ.. గత నెల 31వ తేదీన కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ దాదా పీర్, ఉపాధ్యాయులు ఐడికే శాస్త్రి, నారాయణ మూర్తి, శివశంకర్, రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమహేంద్రవరం, దవళేశ్వరానికి చెందిన రాధాకృష్ణ సంగీత నృత్య కళా క్షేత్ర వారి సంప్రదాయ నృత్యం అలరించింది. వినాయకకౌత్వం, మహాగణపతిం, లింగాష్టకం, కాలభైరవాష్టకం, కనకధారస్తోత్రం, ఆనందతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు లక్ష్మీదీపిక, హర్షిత, అమృత, కార్తికేయని, భవ్యతేజస్విని, కీర్తి పర్ణిక, శరణ్య, పూజ, వర్షిణి, ప్రణీత, కావ్య, భవ్య సిరిచందన, ప్రణవి, కిరణ్మయి తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం





కోవెలకుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న తల్లులు, చిన్నారులు ,టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: తల్లిపాలు బిడ్డకు అన్ని విధాలా శ్రేయస్కరమని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ రాబర్ట్ కెన్నెడి పేర్కొన్నారు. పట్టణంలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, తల్లులు, చిన్నారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన తల్లుల సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తిని తట్టుకునే పోషకాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, వీరభద్రుడు, అంగన్ వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : నవజాత శిశువు మొదటి ఆహారమైన తల్లిపాలను తాపించడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు తెలిపారు. గురువారం మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం జరిగింది. మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డ పుట్టిన రోజు నుంచి ఆరు నెలల పాటు పాలు తాగించాలని సూచించారు. అంగన్ వాడీ వర్కర్స్, ఏఎఎన్ఎంలు ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మీరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీశైలజ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు,హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డోన్: బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, సంపూర్ణ ఆరోగ్యంతో బిడ్డల ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడతాయని ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్, కొత్తపేట ప్రాంతాల మీదుగా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే పసిపిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పాలు ఇవ్వడం మూలంగా తల్లికి రొమ్ము క్యాన్సర్, చర్మ క్యాన్సర్ లాంటివి సంక్రమించే అవకాశం ఉండదన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరమేశ్వరి, పద్మ, శోభారాణి, దేవకృపమ్మ, సుగుణమ్మ, శకుంతల, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల:పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని బనగానపల్లె ప్రాజెక్ట్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం కొలిమిగుండ్లలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు,తల్లులతో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లి పాలతో పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.